అత్తాకోడళ్లు

పురాణం కుమార రాఘవశాస్త్రి గారు బి. ఏ.

౧

కనిపెంచిన తల్లిగానీ, లేకపోతే అగ్నిసాక్షిగా పెండ్లిచేసికొన్న అనుకూలురాలైన భార్యగానీ ఎవరో ఒకరైనా రుచింపకపోతే అతనిజీవితం సుఖబాహ్యమైంది. ఒకగృహం దుఃఖమయంగా వుండటానికైగానీ, ఆనందదీపం వెలుగుతూ ప్రకాశిస్తూండుటకుగానీ కారణభూతురాలైంది స్త్రీ. అందుచేత అనేకమంది స్త్రీలహృదయాలు విద్యాగంధముచేత మూఢత్వము నశించి పునీతముకావాలి.

"అమ్మా! అమ్మా!" అని పిలుస్తూ బయట ఎఱ్ఱఎండలో నిల్చుని తలుపుతట్టుతున్నాడు కృష్ణమూర్తి పగలు పదకొండుగంటలవేళ. గడచిన రెండుమూడు రోజులనుంచీ ఒకటేధారగా వర్షపాతమూటచేత గాబోలు ఆనాడు తీక్ష్ణంగావున్నాడు సూర్యుడు.

ఉద్యోగాలుదొరక్క 'రిట్రెంచిమెంటు' అనే మాటకు కీర్తిప్రబలిపోయిన ఈరోజుల్లో 'ఇల్లు ఎలా గడపటమా?' అనే జుగుప్సతో కృంగిపోయే విద్యాధికులలో కృష్ణమూర్తి ఒకడు. వచ్చేరాబడి సున్నా. బీదసంసారం. అక్కాడితేనేగాని ప్రేగులాడవు. ఏంచేస్తాడు? ఏకానికంతల్లోనైనాసరే నాలుగు రాళ్ళు దొరుకుతవీఅంటే పోవడానికి సంసిద్ధుడై వున్నాడు. 'అవూళ్ళో కాఫీహోటలువున్నదా?' షికార్లుపోవడానికి బీచిలాంటిదేమన్నావుందా?' నాటకసమాజాలు, సినీమాలు వున్నాయా?' అని అడగడా బి. యే. చాలారోజులు తిరిగీ తిరిగీ ఉద్యోగందొరక్క చివరకు గుంటూరులో నాలుగు ప్రైవేటు ట్యూషన్లుచెప్పుతూ కాలంగడపుతున్నాడు. ఒకపాతిక రూపాయిలు గిట్టుతున్నాయి. "ఏదో కొంతనయం" అనుకున్నాడు. నాలుగుసార్లు తట్టగా తలుపు తెరువబడింది. లోపలికి అడుగువేశాడు కృష్ణమూర్తి. అప్పుడేతలుపుతీసి తలవంచుకొని వంటయింట్లోకి వెళ్ళిపోతున్నది అతనిభార్య. వెనుకనుంచి అతనికి కనుపిస్తున్నది అపాదుగా టిసంచీజడ, సొమ్ములులేకుండా సౌందర్యం గ్రక్కుచున్న ఆమెడా. నిట్టూర్పువిడిచాడు కృష్ణమూర్తి. "ఆమె చాలఅందగత్తె. ఐనా ప్రేమసహితంగాని ఆసౌందర్యమంతా రసహీనంగా వుంది" అనుకున్నాడు.

తలుపుమూల చెప్పులువిడిచి అక్కడ నులకమంచం వాల్చుకుని కూర్చున్నాడు. ఎక్కడోఊరు చివర ట్యూషన్లుచెప్పుకుని వచ్చేసరికి చాలఅలసిపోయాడు. ఒళ్ళంతాచెమటపట్టింది. కళ్ళు తేలిపోతున్నై. నీరసపడ్డాడు.

పద్మావతి ఏవోపనులుచూచుకుంటున్నది వంటయింట్లో. భర్త ఎంతఅలసిపోయాడో గమనించడానికి అతనివేపింతవరకూచూడేలేదు. ఏదోవచ్చాడు, కూర్చున్నాడనుకుంది.

కాని కృష్ణమూర్తి కవిహృదయంమాత్రం ఆరాటపడుతున్నది ఊరికే. ఆమె కటాక్షవీక్షణప్రసారంలో చెమటార్పుకో తలస్తాడు. ఆమె చిరునవ్వు వెన్నెల్లో విశ్రాంతికోరుకుంటాడు. తనజీవితంలో అవి తనకు అలభ్యమని తెలును. కాని కోరుకోడంమాత్రం మాని వేయడు.

కట్టుకున్న ధోవతిచెంగుతో నుదుటిమీద చెమటచుక్కలు తుడుచుకున్నాడు. అక్కడే ఎదరగోడకానుకుని కూర్చున్నది అతనితల్లి. కాస్సేపు నిశ్శబ్దంగా వున్నదింట్లో. ఎవ్వరూమాట్లాడలేదు. చివరకు కృష్ణమూర్తే "వంటైందా? మళ్ళీ ట్యూషన్లకు పోవాలి" అన్నాడు.

అతనితల్లి అందుకున్నది: "ఈపాటికప్పుడే ఎల్లాగౌతుంది, బాబూ! వంట. నీపెళ్ళాం సబ్బులతో స్నానాలుచేసి, తలదువ్వి, చీర సింగారించుకుని వంటయింట్లో అడుగుపెట్టేసరికి పదిగంటలౌతున్నది."

దీనికి పద్మావతి ఊరుకుందా? "పోస్సి, మీరే మడికట్టుకోపోయారు" అని ఒకసమిధ తగిలించింది.

"ఏమిటే, లోపటనుంచి గొణుగుతున్నావు. అయితే, నిన్నూ నీమొగుణ్ణి కూర్చోబెట్టి ఎల్లకాలం చేసి పెట్టుతుంటాననుకున్నావా? సాగవు పిల్లా! ఆవేషాలు."

"ఐతే మీఆక్షేపాలు కట్టిపెట్టండి."

"అదీ! అలాగమాటకు మాటా వప్పజెప్పటం బాగా నేర్పిపంపిందిలే మీఅమ్మ. ఇంకేం, బాగా గడిదేరిపోయావు. ఇలాగైతే చక్కగానే సంసారం చేస్తావు."

"ఓహో, మాఅమ్మనుకూడా రంగంలోకి తెచ్చారూ!"

కృష్ణారావుకు చిరాకనుపించింది. ఏమిటీ అసంధర్భపువాదనంతా లేకపోతే. వింటున్నాడు. వాళ్ళ వాగ్ధోరణి ఆపడానికి శక్తిలేదతనికి. చదువుకున్నాడే కాని ఇల్లాంటివ్యవహారాల్లో అనుభవంలేదతగాడికి.

ఎవరిని ఏమంటాడు! విడువుమంటే పాముకు కోపం; కరువుమంటే కప్పకుకోపం. కాస్తతల్లినే మందలించి ఆమె అనేమాట లెన్నోనాపడవచ్చు. కాని భార్యను పదిఅని ఆమెచేత ఒకటిపడ్డా మానవాని. ఐనా కృష్ణమూర్తి భార్యనేకసిరాడు, "నోరుమూసుకో, ఒసే, అతిగా వాగక"అంటూ.

దీనికి ముసలావిడజవాబిచ్చింది. "దాన్నెందుకు కోపంచేస్తావు, నాయనా! నన్నేకోపంచేయి. నేనే మీయిద్దరిమధ్యా శనిలాగా తగులుకున్నాను. ఈ కాలంలో కోడళ్ళువచ్చేలోగా అత్తలు ఏనూరియో, గోయో చూచుకుంటే సుఖం. లేకపోతే—"

"ఎందుకమ్మా అలావుపన్యాసమిస్తావు. ఏమన్నాను నిన్ను!"

"నేనేమిస్తాను, నాయనా! వుపన్యాసాలూ. నా వంటిమీది సొమ్ములన్నీ అమ్మేసి బి.ఏ. దాకా చెప్పించాను నీకు. వుపన్యాసాలిస్తే నీవివ్వాలి. లేకపోతే టక్కుటమార్లన్నీ నేర్చిన నీభార్యఇవ్వాలి. నాదేమిటి, కాటికికాళ్ళు చాచివున్నాను."

"నిన్నేమీఅనలేదమ్మా! నేను."

"ఇంకాఏమనాలి. అన్నీనీభార్యచేతనే అనిపిస్తున్నావు. నాబ్రతుకలాఐంది. ఎందుకు! నాదారినేను వెళ్ళిపోతాను ఏకాశో, రామేశ్వరమో. పెళ్లాంరాగానే తల్లిముండ విషమైపోతుంది. నీకేకాదు. లోకంతరహాయే అంత." కన్నీళ్ళుపెట్టుకుంది ఆవిడ.

ఇంత గందరగోళం జరిగింతర్వాత ఏమిసహిస్తుంది తిండి; నాలుగుమెతుకులుకొరికి బయటపడ్డాడు కృష్ణమూర్తి.

ఇల్లాంటినాటకాలు కృష్ణమూర్తియింట్లో క్రొత్తకాదు. రోజుకు నాలుగైదుజరుగుతూంటై. పెద్దది ఎలాగైనా అత్తగారు, ఏమైనాఅంటే పద్మావతి ఊరుకుంటే తప్పేముంది? అలావూరుకోటం ఆపిల్ల స్వభావంకాదు. మాటంటే అభిమానంజాస్తి. మాటకు మాట మళ్ళీ గిరాటువేయవలసిందే. చిన్నప్పుడు మరీ గయ్యాళిగంపగావుండేది. కోపంవస్తే తల్లిని రక్కిపెట్టేది. అత్తగారితో ఇంకా అంతదాకా రాలేదు. మాటల్లోనేవుంది వ్యవహారం.

ఇంట్లో యింత అల్లకల్లోలంగావుండటము కృష్ణమూర్తి మనస్సుకు చాలకష్టంగావున్నది. అందుమూలకంగా అతనివుత్సాహం పూర్తిగా నశించింది. చదువుకునేరోజుల్లో తన భావిజీవితంగురించి ఎలాటి హర్మ్యాలు నిర్మించుకున్నాడో అవన్నీ పాతాళానికి కూలిపోయినై. రసహీనమైన కట్టెట తనశరీరం, తన చుట్టూ అంధకారమేట. దుఃఖసముద్రంలో ఏకాకిట తాను. విషాదగీతాలు వ్రాసుకోటం సాగించాడు.

౨

"ఏమండీ! రేపో ఎల్లుండో మానాన్నవస్తాట్ట. మాకడగొట్టుతమ్ముడి అన్నప్రాశనట; తీసుకవెళ్తానని వుత్తరం వ్రాశాడు. వెళ్తాను."

"ఏం వెళ్ళకపోతే అన్నప్రాశనమాత్రానికి."

"వెళ్లాలి. ఉడుగోతప్పించెలాగా మా రెండో తమ్ముడితర్వాత ఎనిమిదేండ్లకు పుట్టుకొచ్చాడు. మళ్ళీ ఒక్కమారు చూచిరావాలి."

"చూడటానికైతే మరోసారి పోవచ్చునే."

"మీకేం, పడిచావమంటారు ఎన్నాళ్ళయినా ఇక్కడ ఈ చెరలో."

"ఏం చెరవచ్చింది నీకు?"

"మీకేం తెలుస్తుంది. రోజల్లా వూళ్ళో సంచారం చేసివస్తారు. ఇంట్లో మీఅమ్మగారితో చీవాట్లుపడు తుండాలి నేను."

"ఏమో పెద్దది. ఆమెమాటలకు నీవు సమాధానం చెప్పడంమానేస్తే తగాదాలేదుగా."

"అనుకున్నారా! అంతమాత్రం ఎదురుచెప్పడం చేతే కొంత ఆగివుంది. లేకపోతే మనిషిని అమాంతంగా మ్రింగివేస్తుం దావిడ."

"పద్మా! చెప్తున్నాను; మామూలకంగా నా ఆత్మశాంతి నశించింది. సుఖంలేదు."

"నేనుమాత్రం ఏం సుఖపడుతున్నాను? ఒక చీరా! ఒకసొమ్మా! దేనికీనోచుకోలేదు. పైగా మీఅమ్మగారిశాపనార్థాలూ. చూచారా? నిన్నతలదువ్వుకుని, పొరబాటున పువ్వులుకూడా పెట్టుకుని, తలుపుదగ్గిరనిలుచుంటే, అంటుందికదా! రోజుకు రెండు మార్లు తలదువ్వటంనేర్చావే ఇప్పుడూ. ఆళ్ళింట్లు ఎవరు తోముతారనుకున్నావు—చూచి సహించలేని తనంకాకపోతే ఏమిటామాట!"

"..............................."

"అసలు నాజన్మలో ఎప్పుడూ అంట్లుతోమి ఎఱుగను. ఒక్కపనీచేయదావిడ. అన్నీ నాకే పురమాయిస్తుంది. పైగాచివరకు ఆక్షేపాలూ, చీవాట్లూను. ప్రొద్దున్నే బావిదగ్గర బట్టలన్నీ నడుములుపడేలాగు వుతికి, వుతికి నేనువస్తే తానుశుభ్రంగా గోడకానుకుని, కూర్చుని, చెంబులుతోమమని పురమాయిస్తుంది. తానేచేయకూడదూ ఆపని నాకోసం నిలవవుంచక పోతే. అన్నిటికీ నేనే చావాలా?"

"..........."

"మాట్లాడరేం. ఇంతకూ నేను మీ భార్యలా కనుపించడంలేదు. కూలీదానిలా ఉన్నాను. మొన్న మీచెల్లెలుండిపోయిన రెండునెలలూ మరీను. 'మంచి నీళ్లుతీసికొనిరా. దొడ్డికిపోవాల నీళ్లు తెచ్చిపెట్టు'— అన్నీ పురమాయింపులు; ఎవరున్నారనో వీళ్లదాసీ లిక్కడ."

"పద్మా! మాటపడితే చెడిపోరు. నన్నుచూచైనా సహించుకోలేవూ అదంతా? ప్రేమలేదూ నీకు నామీద.?"

"మీరు వేదాంతం చెప్తారు. అసలు మీలో పజను లేకపోవడంచేతే అందరిచేతా నాకీమాటలు."

భార్యయొక్క వుపన్యాసాలకు సమాధానం తోచ లేదు కృష్ణారావుకు. బి. ఏ. ప్యాసైతేమాత్రం ఆ తెలివితేటలు వస్తాయా? ఏషేక్స్పియరోమీదో, షెల్లీ నిగురించో లెక్చరైతే బనాయిస్తాడు నిరాఘాటంగా.

పద్మావతి ధోరణి ఎక్కువైపోతున్నది. మునలావిడమీద తప్పిదాలెన్నో బయటకు వస్తున్నవి. ఇంట్లో అత్తాకోడళ్లిద్దరకూ, సహజంగా వాళ్ళమనస్సులు మారిపోయి సహింపుకలగాలిగాని, తనహితోపదేశం పనిచేయదని కృష్ణమూర్తితలంపు.

ఇక నక్కడ నిలవకుండా చివాలునలేచి ఉత్తరీయం పైనవేసుకుని బయలుదేరాడు. 'రమ్మని మానాన్నకు వుత్తరం వ్రాయమన్నారా?' అన్న పద్మావతి ప్రశ్న అతడు వినుపించుకోలేదు. తిన్నగా నల్లచెరువుచాయపోయి ఒడ్డుమీద కూర్చున్నాడు.

సాయంసమయం. మెల్లగావీస్తున్న పిల్లగాలికి చిన్నచిన్న అలలు లేస్తున్నై చెరువులో. అప్పుడప్పుడు నీటిపైకి తేలుతున్న చేపలకోసం రివ్వున పైనుంచి దిగుతున్నై పిట్టలు. కృష్ణుడు ఊహాప్రపంచంలో ఊగులాడుతున్నాడు.

"దానికి నామీదప్రేమసున్నా. నాతలంపులన్నింటికీ విరుద్ధఫలితాలే కలుగుతూండడం నాదురదృష్టం. ఎన్నడూఅనుకోలేదు నాజీవితంలో ఇట్టి మనఃక్లేశాలకు పాలౌతానని.

ప్రతీహింసా గృహమూ అత్తాకోడళ్ల వాగ్వాదంతో మారుమ్రోగ వలసిందేనా? కొడుకుమీద

తల్లికీ, భర్తమీద భార్యకూ ప్రేమ వుండకుండా ఉంటుందా?, ఉంటే ఎందుకుకలుగుతుంది ఈగృహకల్లోలం.

వెతకివెతకి సౌందర్యరాశిఅని పెండ్లిచేసుకున్నానుదాన్ని. మనసారా ప్రేమిస్తున్నాను. దుఃఖమే నాకు మిగిలింది. ప్రేమించే ఆత్మకు దుఃఖమేనా పరమావధి?

ఇంతకూ కారణం ఎక్కువసంపాదించలేని నాఅసమర్థత అనుకుంటూ. ఐతే ధనికులు ఇండ్లల్లో లేవా ఈకల్లోలాలు. అదీకాక ద్రవ్యానికీ సుఖానికీ సంబంధమేముంది?—కారణంలేదు. తన పెద్దరికం, 'అథార్టీ' చూపించాలని అడుగడుక్కీ తప్పులువేరి చీవాట్లు పెట్టుతుంది అత్తగారు కోడల్ని. కోడలు మొదటకొంత సహించి వూరుకున్నా చివరకు ఎదురు తిరిగి తీరుతుంది. వాళ్లవైరం సహజం—ఎలుకాపిల్లులకూ, పిల్లీ కుక్కలకూ మల్లే."

ఒక జెస్తవాడు తనవలలోపడ్డ ఒకచేపను విసరి ఒడ్డుకువేశాడు. కృష్ణమూర్తిసమీపానపడి అది గిలగిలా తన్నుకుంటున్నది. నిద్రలో కలగని లేచినవాడులాగా వులికిపడి నాల్గుదిక్కులూ చూచాడు ఒకసారి. సూర్యబింబం భూమిచాటుకు పోయింది. సాంధ్యరాగాలు మబ్బులలో ప్రతిఫలిస్తున్నవి. కృష్ణమూర్తిలేచి ఇంటివైపు సాగించాడు అడుగులు.

అతని ఊహలు తెగలేదు. తలవంచుకుని ఆలోచిస్తూ నడుస్తున్నాడు. వీథుల్లోఏమిన్నీ కాఫీహోటళ్ళలో గ్రామఫోనుపాటలైనా అతన్ని ఆకర్షించలేదు. అతను ఇంటికిచేరే సరికి బాగా చీకటిపడింది. అంతా అంధకారమే.

3

పద్మావతి పుట్టింటికిపోయి రెండు నెలలైనా లేదు. పోయి తీసికొనివద్దామన్న వుద్దేశము కృష్ణమూర్తికిలేదు. ఆమెతండ్రిఐనా తీసుకవచ్చి దిగబెట్టి పోలేదు. ముసలావిడమాత్రం రోజూ కోడల్ని తీసుకరమ్మని పోరుతూనేవుంది. "ఉన్నన్నాళ్లూ ఇద్దరకూ పడదూ. ఇప్పుడు తానే తీసికొనిరమ్మంటుందేమో?" అనుకున్నాడు కృష్ణమూర్తి.

కృష్ణమూర్తిని ఆకర్షించేదేమీ పద్మావతిదగ్గర కనుపించదు. చివరకు తల్లిపోరువల్లనే అత్తగారింటికి పోయాడు. గుడివాడతాలుకాఆఫీసులో గుమాస్తా అతనిమామగారు.

అల్లుడిమర్యాద సక్రమంగానే జరిగింది. అత్తగారింటికివచ్చి మళ్లీ వెంటనే వెళ్లడం బాగుండదని రెండు రోజులైనతర్వాత మూడోనాడుసాయంత్రం ఆరుగంటలబండికి ప్రయాణమని చెప్పతూ భార్యనుకూడా తీసుకవెళ్తానని వెళ్లబెట్టాడు.

అందుకు కృష్ణమూర్తిఅత్తగారు గొంతు సవరించుకుని ఉపన్యాసం సాగించింది. వాళ్లయింట్లో వ్యవహారాలన్నీ అసలు ఆవిడే సర్దుతూంటుంది. కచేరీలో పనిచేసి ప్రతినెలా ఒకటోతారీఖున జీతంరాళ్లు తెచ్చి తనచేతుల్లో పోసేటంతవరకే ఇంటాయన 'డ్యూటీ'. ఇక ప్రతివిషయంలో ఆమే ముందడుగు వేస్తుంది. భర్తమాట సాగనియ్యదు. ఆయనకేమీ ప్రపంచకజ్ఞానంలేదని ఆమెఊహ. అది తెలిసి ఆయన సాధ్యమైనంతవరకు మౌనముద్రలోనే వుంటాడు. ఆమె ఎంతచెపితే అంతా. కూర్చోమంటే కూర్చోటం. నిల్చోమంటే నిల్చోటం. గవర్నమెంటు వుద్యోగస్తుడైనా యింట్లో నౌకరుమాత్రుడే.

పద్మావతిని తీసుకవెళ్తానని కృష్ణమూర్తిఅనగానే మామగారు మాట్లాడలేదు. అత్తగారే మొదలుపెట్టింది. "అబ్బాయీ! నీవు ఎక్కువగా చదువుకున్నావు, మాఅమ్మాయి సుఖపడుతుందని నీకిచ్చాము. ప్రేగుతీసి నీమెళ్లో వేశామన్నమాట. ఇప్పటికైనా నీతప్పేమీ లేదు. కాని మీఅమ్మదగ్గరమాత్ర మాఅమ్మాయి కాపురం చేయలేదు. అంతా నీకు తెలిసేవుంటుంది. అల్లారుముద్దుగా పనీ, పాటా చెప్పకుండా పెంచుకున్నపిల్లఅది. పదిహేనేండ్లైనా పూర్తిగా నిండలేదు దానికి. ఆరళ్లుపడలేదు. మీఅమ్మను విడిచి వేరే మీయిద్దరూవుంటే పిల్లను పంపటానికి మాఅభ్యంతరంలేదు. కాదంటవా, ఇక్కడే మాతోవుండు,

ఈలోగా మీమామగారు నీ వుద్యోగానికి ప్రయత్నిస్తుంటారు."

కృష్ణమూ_ర్తికి కోపంవచ్చింది. తనతల్లినివిడిచి వేరే వుండాలా? అలాకాకపోతే వీళ్లింట్లో అనాథలా గా పడివుండాలా? అసంభవము. ఆత్మగౌరవంలేనివాడా కృష్ణమూ_ర్తి.

ఎంతో అవమానపడ్డట్లు సిగ్గుపడ్డాడు. కోపోద్రేకంకూడా కలిగింది. కాని అణచుకున్నాడు. ఎవరితోనూ ఎదిరించి పోట్లాడేశ_క్తి లేదతనికి. పాపం, అమాయికపునైతికుడు.

వెంటనే అక్కడనుంచి లేచిపోయి ఒక గుఱ్ఱపు బండి మాట్లాడితెచ్చాడు. బండివాడిచేత తన సూటుకేసు బండిలోపెట్టించాడు. తానుకూడా బండిలో ఎక్కుతూ చివరసారి అ_త్తగారింటివేపుచూచాడు. పద్మావతి గుమ్మందగ్గరనిల్చుని చూస్తున్నది. అతని విశాలనేత్రాల్లో ఒక భయంకరమైన తెగువ వ్య_క్తమగుతున్నది. పొడుగూ, పొట్టీకాని బలిష్టమైన అతని యౌవనాకారం ఆమెహృదయాంకితమై, ఆఛాయ ఆమె జీవితాంతంవరకూ మాసిపోలేదు.

జట్కావీథిమలుపు దాటిపోయింది. గుఱ్ఱము మెడకు కట్టిన గజ్జెలమ్రోతమాత్రం వినిపిస్తున్నది. పద్మావతి గుమ్మందగ్గిరే నిల్చున్నది. గజ్జెలచప్పుడు తగ్గింది. సన్నపడి సన్నపడి వినుపించలేదు. పద్మావతి హృదయంలోమాత్రం మారుమ్రోగుతూనేవున్న దాగజ్జెలమ్రోత. లోపలికిపోయింది పద్మ. పగలుగడచింది. చీకటిపడింది. ఆకాశాన నక్షత్రాలు మొలచినై. పద్మ హృదయంలో ఏదో భయంగావుంది. గుండె కొట్టుకుంటున్నది. కారణం ఆమెకే అవగాహనకాదు. ఆరాత్రిపనుల్లో తల్లికి సాయపడలేదు. భోజనంకూడా మానేసింది.

పది పదిహేనురోజులు గడచినై. ఒకనాడు పద్మావతి తల్లితో గుంటూరుపోతానని చెప్పింది. ఆమె కోప్పడ్డది. పద్మ పట్టుపట్టింది. 'అలాగైతే చూస్తూ చూస్తూ బావిలో దూకు' అంటూ విసుక్కుంది తల్లి.

పద్మావతి గుంటూరు చేరేసరికి. అక్కడ కృష్ణారావులేడు. పద్మావతి గుండెలు మరీకొట్టుకుంటున్నవి. వణుకుతూ సంగతంతా ముసలావిడతో చెప్పింది. ఇంటికిరాక కృష్ణుడుఎక్కడకుపోయాడో? అత్తాకోడళ్లిద్దరూ ఒకరిచేతుల్లో ఒకరు వాలి ఏడ్చారు.

కన్నీటికణము

కర్లపాలెం కృష్ణారావుగారు

ఘోరకష్టాల ననిశంబు గోరుకొందు
నమితదుఃఖాల కేను యాహ్వానమిడుదు
శోకమే నాకు ముదమునుజూపగలదు
యేమ్చుకోలదిని బొందెద నెంతొహాయి
కంట నొకకొన్ని బిందువు ల్గారెనేని
రాలిపోవును హృదయభారంబుకొంత
నయనముల నీటిచుక్కలు నడచెనేని
శాంతిచేకూరు మిగుల నాస్వాంతమునకు
నీప్రసన్నతకలిమిచే నేనుమిగుల
కష్టమునగల్గుసుఖమును గాంచినాడ
శోకమునన్నుహాయిని జూచినాడ

నీకు వందనమమ్మ కన్నీటికణమ!
అలజడియెలేనిశూన్యంపుటర్ధరాత్రి
వెక్కివెక్కి నే నేడ్చుచు పొక్కుచుండ
బుజ్జగింపగవచ్చితి వొజ్జవోలె
నీబుణంబెట్లుదీర్తు కన్నీటిధార!
హృదయకుహరానహ_త్తి యేమేమిగలవో?
అతివిషాదపరంపర లలముకొనెనో?
తీవ్రతామసముండెనో తెంపులేక?
సతత మానందసందోహచయమెగలదొ
వివరముగతేల్చిచెప్పు వివేకమతివి
నీవెగా కెవ్వ రమ్మ! కన్నీటికణమ!